# ఎస్తేరు
# గ్రంథం

## వష్తి రాణి బహిష్కరణ

1 ఇండియా నుండి కూషు దేశం* వరకు 127 సంస్థానాలను
పరిపాలించిన రాజైన అహష్వేరోషు కాలంలో జరిగిన సంఘటనలు
ఇవి.
2 ఆ సమయంలో అహష్వేరోషు రాజ సింహాసనం ఉన్న షూషు కోట
నుండి పరిపాలించాడు.
3 అతని పరిపాలనలోని మూడవ సంవత్సరంలో తన
సంస్థానాధిపతులకు, అధికారులకు అందరికి విందు ఏర్పాటు
చేశాడు. పర్షియా, మెదీయ సేనాధిపతులు, రాకుమారులు,
సంస్థానాధిపతులు విందుకు హాజరయ్యారు.

4 నూట ఎనభై రోజులు పాటు అతడు తనకున్న విస్తారమైన రాజ్య
ఐశ్వర్యం, వైభవం, ఘనత, తేజస్సు ప్రదర్శించాడు.
5 ఈ రోజులు గడిచిన తర్వాత, ఏడు రోజులపాటు రాజభవన
తోటలో రాజు విందు చేశాడు, షూషనులో ఉన్న అల్పుల నుండి
ఘనుల వరకు, ప్రజలందరికి అతడు విందు చేశాడు.
6 ఆ తోటలో పాలరాతి స్తంభాలకున్న వెండి ఉంగరాలకు
తెలుపు నార త్రాళ్లు ఊదా రంగు పట్టీలతో తగిలించి ఉన్నాయి.
తెరలు కట్టడానికి వాటి మీద వెండి కమ్ములు, అవిసెనార త్రాళ్లకు
తెరలు వ్రేలాడుతున్నాయి. చలువ రాయి పాల రాయి ముత్యం
ఇతర విలువైన రాళ్లు పరచిన నేల మీద వెండి బంగారాలతో
అలంకరించబడిన పరుపులు ఉన్నాయి.

* **1:1** అంటే, నైలు ఉపరితల ప్రాంతం

7 అతిథులకు బంగారు పాన పాత్రల్లో ద్రాక్షరసం వడ్డించారు, ఒక్కో
పాత్ర ఒక్కో దానికి భిన్నమైనది, రాజు ధారాళ స్వభావం గలవాడు
కాబట్టి ద్రాక్షరసం సమృద్ధిగా ఉంది.
8 రాజు ఆజ్ఞను బట్టి ప్రతి అతిథి కూడా ఎలాంటి పరిమితి
లేకుండా త్రాగవచ్చు ఎందుకంటే వారందరికి కోరినంతగా ద్రాక్షరసం
అందించమని వడ్డించే వారిని రాజు ఆదేశించాడు.
9 వష్తి రాణి కూడా తన రాజైన అహష్వేరోషు యొక్క రాజ్య
భవనంలో ఉన్న స్త్రీలందరికి విందు ఏర్పాటు చేసింది.
10-11 ఏడవ రోజున, రాజైన అహష్వేరోషు ద్రాక్షరసంతో ఉల్లాసంగా
ఉన్నప్పుడు, తనకు సేవచేసే మెహూమాను, బిజ్తా, హర్బోనా,
బిగ్తా, అబగ్తా, జేతరు, కర్కసు అనే ఏడుగురు నపుంసకులకు
రాణియైన వష్తిని తన రాజకిరీటాన్ని ధరింపజేసి తన అందాన్ని
ప్రజలకు, సంస్థానాధిపతులకు చూపించడానికి, తన ముందుకు
తీసుకురావాలని ఆజ్ఞాపించాడు. ఆమె చూడటానికి చాలా అందంగా
ఉంటుంది.
12 అయితే ఆ నపుంసకులు రాజు ఆజ్ఞను రాణియైన వష్తికి
తెలియజేసినప్పుడు, ఆమె రావడానికి ఒప్పుకోలేదు. అప్పుడు రాజు
ఆగ్రహంతో, కోపంతో మండిపడ్డాడు.
13 చట్టం, న్యాయం విషయాల్లో రాజు నిపుణులను సంప్రదించడం
ఆచారం కాబట్టి, కాలాలను అర్థం చేసుకునే జ్ఞానులతో,
14 కర్షెనా, షెతారు, అద్మాతా, తర్షీషు, మెరెసు, మర్సెనా
మెముకాను అనే ఏడుగురు రాజుకు సన్నిహితులు. రాజు దగ్గర
ప్రత్యేక హోదాలో రాజ్యంలో ఉన్నతమైన స్థానాల్లో ఉన్న పర్షియా,
మెదీయకు చెందిన ఈ ఏడుగురు సంస్థానాధిపతులతో రాజు
మాట్లాడాడు.
15 "చట్టం ప్రకారం రాణియైన వష్తిపై ఏం చర్య తీసుకోవాలి?" అని
రాజు అడిగాడు. "రాజైన అహష్వేరోషు అనే నేను నపుంసకుల ద్వారా
పంపిన ఆజ్ఞకు రాణియైన వష్తి లోబడలేదు."

16 అప్పుడు మెముకాను రాజు ఎదుట సంస్థానాధిపతుల ఎదుట
జవాబిస్తూ, “వష్తి రాణి తప్పు చేసింది, రాజు పట్ల మాత్రమే కాదు కాని
అహష్వేరోషు రాజు పరిపాలిస్తున్న అన్ని సంస్థానాధిపతుల ఎదుట,
ప్రజలందరి ఎదుట తప్పు చేసింది.
17 రాణి ప్రవర్తన స్త్రీలందరికి తెలిసిపోతుంది, అప్పుడు వారు తమ
భర్తలను చులకన చేస్తూ, ‘రాజైన అహష్వేరోషు తన రాణియైన వష్తిని
తన ముందుకు రమ్మని ఆజ్ఞాపిస్తే ఆమె రాలేదు’ అంటారు.
18 రాణి ప్రవర్తన గురించి విన్న పర్షియా మెదీయ సంస్థానాధిపతుల
భార్యలు ఈ రోజే రాణి అన్నట్లే రాజ అధిపతులందరితో అంటారు.
దీనివలన అంతులేని తిరస్కారం కోపం కలుగుతుంది.
19 “కాబట్టి రాజుకు ఇష్టమైతే, రాజైన అహష్వేరోషు ముందుకు
వష్తి రాణి ఇక ఎన్నడూ రాకూడదని రాజాజ్ఞ జారీ చేయండి. అది
రద్దు కాకుండా ఉండడానికి దానిని పర్షియా మెదీయ శాసన గ్రంథాల్లో
వ్రాయాలి. అంతేకాక, ఆమెకంటే యోగ్యురాలికి రాణి స్థానాన్ని
ఇవ్వాలి.
20 అప్పుడు రాజు నిర్ణయాన్ని అతని మహారాజ్యమంతా ప్రకటిస్తే,
అల్పుల నుండి ఘనుల వరకు స్త్రీలందరూ తమ భర్తలను గౌరవిస్తారు”
అన్నాడు.
21 ఈ సలహా రాజుకు, అతని సంస్థానాధిపతులకు నచ్చింది,
కాబట్టి మెముకాను ప్రతిపాదించినట్లు రాజు చేశాడు.
22 అప్పుడు రాజు, ప్రతి పురుషుడు తన కుటుంబానికి తానే
యజమానిగా ఉండాలని ఆజ్ఞాపిస్తూ తన రాజ్యంలోని అన్ని
ప్రాంతాలకు ప్రతి సంస్థానానికి ప్రజలందరికి వారివారి భాషల్లో
వ్రాయించి తాకీదులు పంపాడు.

# 2

## ఎస్తేరు రాణి అయింది

1 తర్వాత రాజైన అహష్వేరోషు కోపం తగ్గినప్పుడు, అతడు వష్తిని, ఆమె చేసిన దానిని, ఆమె గురించి ఎలాంటి శాసనం ఇచ్చాడో జ్ఞాపకం చేసుకున్నాడు.
2 రాజ వ్యక్తిగత పరిచారకులు, "రాజు కోసం అందమైన యువ కన్యకలను వెదకడం జరగాలి.
3 రాజు తన సామ్రాజ్యంలో ఉన్న ప్రతి దేశంలో ఈ అందమైన యువ కన్యకలను షూషను కోటలో ఉన్న అంతఃపురంలోకి తీసుకురావడానికి ప్రతినిధులను నియమించాలి. ఆ యువ కన్యకలు రాజు యొక్క నపుంసకుడైన హేగై సంరక్షణలో ఉంచాలి; ఆ స్త్రీలకు అందం కోసం సుగంధద్రవ్యాలు అందించాలి.
4 తర్వాత వారందరిలో ఏ కన్య రాజుని ఆకర్షిస్తుందో, ఆమె వష్తి స్థానంలో రాణి అవుతుంది" అని ప్రతిపాదించారు. ఈ సలహా రాజు ఆమోదం పొందింది, అతడు దానిని పాటించాడు.
5 ఆ సమయంలో షూషను కోటలో బెన్యామీను గోత్రానికి చెందిన కీషుకు పుట్టిన షిమీ యొక్క కుమారుడైన యాయీరుకు పుట్టిన మొర్దెకై అనే యూదుడు ఉండేవాడు,
6 బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేము నుండి చెరకు తీసుకెళ్లిన యూదా రాజైన యెహోయాకీనుతో* పాటు ఉన్నవారిలో ఇతడు ఉన్నాడు.
7 మొర్దెకై యొక్క పినతండ్రి యొక్క కుమార్తె, హదస్సా అనే బంధువు ఉన్నది, ఆమెకు తల్లిదండ్రులు లేనందుకు అతడే ఆమెను పెంచాడు. ఎస్తేరు అని కూడ పిలువబడే ఈ యువతి మంచి రూపం కలిగి, అందంగా ఉండేది. ఆమె తల్లిదండ్రులు చనిపోయినప్పుడు మొర్దెకై ఆమెను తన సొంత కుమార్తెగా దత్తత తీసుకున్నాడు.
8 రాజు ఆజ్ఞ అంతా ప్రకటించబడింది, చాలామంది యువతులను, షూషను కోటకు తెచ్చారు, హేగై అనే ఆ అంతఃపురం యొక్క అధికారి

* **2:6** హెబ్రీలో యెకొన్యా యెహోయాకీనుకు మరొక రూపం

ఆధీనంలో వారిని ఉంచారు, ఎస్తేరును కూడా రాజభవనానికి తీసుకెళ్లి హేగైకు అప్పగించారు.
9 ఎస్తేరు అతనికి నచ్చింది, దయ పొందుకుంది. వెంటనే
పరిమళద్రవ్యాలు ఆమెకు అందించి, ప్రత్యేక ఆహారం ఆమెకు ఏర్పాటు చేశాడు. అతడు ఆమె కోసం రాజభవనం నుండి ఏర్పరచబడిన ఏడుగురు స్త్రీ పరిచారకులను నియమించాడు, ఆమెను, ఆమె పరిచారకులను అంతఃపురంలోని శ్రేష్ఠమైన స్థలంలోనికి పంపించాడు.
10 ఎస్తేరు తన జాతిని, తన కుటుంబ నేపధ్యాన్ని
బయలుపరచలేదు, ఎందుకంటే అవి చెప్పకూడదని మొర్దెకై ఆమెకు ఆదేశించాడు.
11 ఎస్తేరు ఎలా ఉందో, ఆమె క్షేమం తెలుసుకోవడానికి మొర్దెకై
ప్రతిరోజు అంతఃపురం ఆవరణం దగ్గరే అటూ ఇటూ తిరుగుతూ ఉండేవాడు.
12 ఒక యువతి రాజైన అహష్వేరోషు దగ్గరకు వెళ్లే సమయం
రాకముందు, ఆమె ఆరు నెలలు పాటు గోపరస తైలం, మరో ఆరు నెలలు వివిధ పరిమళద్రవ్యాలు వాడాలి.
13 ఈ విధంగా ఒక యువతి రాజు దగ్గరకు వెళ్లాలి: అంతఃపురం
నుండి రాజు సముఖంలోకి వెళ్లేటప్పుడు, ఆమెకు ఏది కావాలో అది తనకు ఇవ్వబడుతుంది.
14 సాయంత్రం ఆమె అక్కడికి వెళ్తుంది, ఉదయం అంతఃపురంలో
ఇంకొక భాగముకు, ఉపపత్నులపై అధికారిగా ఉన్న షయష్గజు యొక్క సంరక్షణకు తిరిగి వెళ్తుంది. రాజుకు ఆమె నచ్చి, తన పేరు పెట్టి పిలిపిస్తే తప్ప ఆమె అతని దగ్గరకు తిరిగి వెళ్లదు.
15 రాజు దగ్గరకు వెళ్లడానికి ఎస్తేరు యొక్క వంతు వచ్చినప్పుడు
(ఈమె మొర్దెకై పినతండ్రి అబీహాయిలు కుమార్తె, మొర్దెకై ఈమెను దత్తత తీసుకున్నాడు), ఆమె రాజు యొక్క నపుంసకుడు, అంతఃపురం యొక్క అధికారియైన హేగై ప్రతిపాదించింది తప్ప మరి ఏవి అడగలేదు. ఎస్తేరును చూసిన వారందరికి ఆమె అంటే ఇష్టం కలిగింది.

16 అలా ఎస్తేరు రాజైన అహష్వేరోషు పరిపాలనలోని ఏడవ
సంవత్సరంలో టెబేతు అనే పదవ నెలలో రాజభవనంలోకి వెళ్లింది.
17 రాజు ఇతర స్త్రీలందరికంటే ఎస్తేరును ఎక్కువ ప్రేమించాడు,
ఆమె ఇతర కన్యకలందరికంటే రాజు దయను, ఆమోదాన్ని
పొందుకుంది. కాబట్టి అతడు ఆమె తలమీద రాజ కిరీటం పెట్టి,
వష్తి స్థానంలో ఎస్తేరును రాణిగా నియమించాడు.
18 రాజు తన సంస్థానాధిపతులు, అధికారులైన అందరికి ఎస్తేరు
గౌరవార్థం గొప్ప విందు ఏర్పాటు చేశాడు. అతడు సంస్థానాలలో
సెలవు ప్రకటించి రాజ ఔదార్యంతో వరాలు ఇచ్చాడు.

### మొర్దెకై ఒక కుట్రను బయట పెట్టుట

19 కన్యకలు రెండవసారి సమావేశమైనప్పుడు, మొర్దెకై రాజ
ద్వారం దగ్గర కూర్చున్నాడు.
20 అయితే ఎస్తేరు మొర్దెకై చెప్పినట్లు తన కుటుంబ నేపథ్యం,
తన జాతి గురించి రహస్యంగా ఉంచింది, మొర్దెకై తనను
పెంచుతున్నప్పుడు ఉన్నట్లే అతని హెచ్చరికలు పాటించింది.
21 మొర్దెకై రాజు ద్వారం దగ్గర కూర్చుని ఉన్న సమయంలో, రాజు
యొక్క ద్వారా సంరక్షకులుగా ఉన్న బిగ్తాన్, తెరెషు అనే ఇద్దరు రాజు
అధికారులు రాజైన అహష్వేరోషు మీద కోప్పడి అతన్ని చంపాలని
కుట్రపన్నారు.
22 అయితే మొర్దెకై ఈ కుట్ర గురించి విని ఎస్తేరు రాణికి చెప్పాడు,
ఆమె మొర్దెకై పేరిట, రాజుకు తెలియజేసింది.
23 ఆ సమాచారం గురించి విచారణ జరిపించినప్పుడు అది నిజమే
అని తెలిసింది, ఆ ఇద్దరు అధికారులు స్తంభాలకు ఉరితీయబడ్డారు.
ఇదంతా రాజు సమక్షంలో చరిత్ర గ్రంథాల్లో వ్రాయబడింది.

# 3

### యూదులను నాశనం చేయాలని హామాను కుట్ర

1 ఈ సంఘటనలు జరిగిన తర్వాత, రాజైన అహష్వేరోషు అగగీయుడైన హమ్మెదాతా కుమారుడైన హామానుకు ఇతర సంస్థానాధిపతులందరికన్నా ఉన్నత స్థానాన్ని ఇచ్చి అతన్ని గౌరవించాడు.
2 రాజ ద్వారం దగ్గర ఉండే రాజ్యాధికారులంతా మోకరించి రాజాజ్ఞ ప్రకారం హామానుకు నమస్కరించారు. అయితే మొర్దెకై హామాను ముందు మోకరించి నమస్కరించలేదు.

3 అప్పుడు రాజ ద్వారం దగ్గర ఉన్న రాజ్య అధికారులు మొర్దెకైని, "ఎందుకు నీవు రాజాజ్ఞకు లోబడట్లేదు?" అని అడిగారు.

4 ప్రతిరోజు వారు అతన్ని అడుగుతున్నా అతడు ఖాతరు చేయలేదు. మొర్దెకై తాను యూదుడని వారికి చెప్పాడు కాబట్టి అతడు తాను చెప్పిన దానిపై నిలబడతాడో లేదో చూడాలని ఈ విషయం హామానుకు చెప్పారు.

5 మొర్దెకై తన ఎదుట మోకరించడం లేదని, గౌరవించడం లేదని చూసి హామానుకు చాలా కోపం వచ్చింది.

6 మొర్దెకై ఏ జాతివాడో తెలుసుకుని, అతన్ని ఒక్కడినే చంపితే సరిపోదు అని అతడు అనుకున్నాడు. బదులుగా హామాను, అహష్వేరోషు రాజ్యమంతటిలో ఉన్న మొర్దెకై ప్రజలను అనగా యూదులందరిని నాశనం చేసే మార్గం కోసం ఆలోచించాడు.

7 రాజైన అహష్వేరోషు పరిపాలనలోని పన్నెండవ ఏట, మొదటి నెల అయిన నీసానులో హామాను సమక్షంలో ఏ నెల ఏ రోజున అలా చేయాలో అని పర్షియా భాషలో పూరు, అనగా చీటి వేశారు. ఆ చీటిలో* అదారు అనే పన్నెండవ నెల వచ్చింది.

8 అప్పుడు హామాను రాజైన అహష్వేరోషుతో ఇలా అన్నాడు, "మీ రాజ్యంలోని సంస్థానాలన్నిటిలో ఉండే ప్రజల్లో ఉన్న ఒక జాతి ప్రజలు వేరుగా ఉంటున్నారు. వారి చట్టాలు ఇతర ప్రజల చట్టాలకు

---

* **3:7** కొ.ప్ర.లలో చీటి వచ్చింది అని లేదు

వేరుగా ఉన్నాయి; వారు రాజు శాసనాలను పాటించరు; అలా వారిని
సహించడం రాజుకు అంత మంచిది కాదు.
9 ఒకవేళ రాజుకు ఇష్టమైతే, వారిని నాశనం చేయడానికి ఓ శాసనం
జారీ చేయండి, నేను పదివేల తలాంతుల† వెండిని రాజ్య ఖజానా
కోసం రాజ నిర్వాహకులకు ఇస్తాను.”

10 కాబట్టి రాజు తన చేతికున్న ముద్ర ఉంగరం తీసి అగగీయుడైన
హమ్మెదాతా కుమారుడైన హామానుకు ఇచ్చాడు, ఇతడు యూదులకు
శత్రువు.
11 రాజు హామానుతో, “డబ్బు నీ దగ్గర పెట్టుకో, నీకు ఏది ఇష్టమో,
అది ప్రజలకు చేయి” అన్నాడు.
12 తర్వాత మొదటి నెల పదమూడవ రోజున రాజ
కార్యదర్శులను పిలిపించారు. వారు హామాను ఆజ్ఞలన్నిటిని రాజు
సంస్థానాధిపతులకు, సంస్థానాధికారులకు, ఆ సంస్థానాల్లోని ప్రజల
అధిపతులకు, అధికారులకు వారి వారి లిపిలో వారి భాషలో వ్రాసి
పంపాలని ఆజ్ఞాపించారు. వాటిని రాజైన అహష్వేరోషు పేరిట వ్రాసి
వాటిపై రాజు ఉంగరంతో ముద్ర వేశారు.
13 అదారు అనే పన్నెండవ నెల పదమూడవ రోజున యువకుల
నుండి ముసలివారి వరకూ స్త్రీలు, పిల్లలు అని తేడా లేకుండా ఒకే
రోజులోనే యూదులనందరిని చంపి నాశనం చేసి, వారి ఆస్తులను
దోచుకోవాలని శాసనాలు వార్తాహరుల ద్వారా రాజు సంస్థానాలన్నిటికి
పంపబడ్డాయి.
14 ఆ రోజు కోసం అందరు సిద్ధంగా ఉండేలా ఆ ఆజ్ఞ ఉన్న ప్రతులను
ప్రతి సంస్థానంలో ఉన్న ప్రజలందరికి పంపించారు.

15 అది రాజాజ్ఞ కాబట్టి వార్తాహరులు వెంటనే బయలుదేరి వెళ్లారు.
ఆ ఆజ్ఞ షూషను కోటలో అందించడం జరిగింది. రాజు, హామాను
త్రాగడానికి కూర్చుకున్నారు, కాని షూషను పట్టణం ఆందోళనగా
ఉంది.

† **3:9** అంటే, సుమారు 375 టన్నులు

# 4

## ఎస్తేరు సహాయాన్ని కోరిన మొర్దెకై

1 మొర్దెకై జరిగిందంతా విని తన బట్టలు చింపుకొని గోనెపట్ట
కట్టుకుని బూడిద వేసుకుని వేదనతో గట్టిగా ఏడుస్తూ పట్టణంలోనికి
వెళ్లాడు.
2 అయితే అతడు రాజభవన ద్వారం వరకు మాత్రమే వెళ్లాడు,
ఎందుకంటే గోనెపట్ట కట్టుకున్న వారెవరికి భవనం లోనికి వెళ్లడానికి
అనుమతి లేదు.
3 రాజు శాసనం, ఆదేశం వెళ్లిన ప్రతి సంస్థానంలో ఉన్న
యూదులంతా ఉపవాసం ఉండి ఏడుస్తూ వేదనతో తీవ్రమైన
దుఃఖంతో ఉన్నారు. చాలామంది గోనెపట్ట కట్టుకుని బూడిద
పోసుకొని ఉన్నారు.
4 ఎస్తేరు రాణి యొక్క నపుంసకులు, చెలికత్తెలు వచ్చి మొర్దెకై
గురించి చెప్పినప్పుడు ఆమె తీవ్ర వేదనకు గురైంది. గోనెపట్ట
తీసివేయమని చెప్పి కట్టుకోవడానికి అతనికి బట్టలు పంపించింది,
కాని అతడు వాటిని తీసుకోలేదు.
5 అప్పుడు ఎస్తేరు, మొర్దెకైను అంత బాధ పెడుతున్న
విషయం ఏమిటో తెలుసుకోమని రాజు ఆమె కోసం నియమించిన
నపుంసకులలో హతాకు అనే అతన్ని పంపింది.
6 కాబట్టి హతాకు రాజభవన ద్వారం ఎదురుగా నగర వీధిలో ఉన్న
మొర్దెకై దగ్గరకు వెళ్లాడు.
7 మొర్దెకై తనకు జరిగిందంతా చెప్పాడు, యూదులను నాశనం
చేయడానికి హామాను రాజు ఖజానాకు ఇస్తానన్న డబ్బు మొత్తం ఎంతో
అతనికి తెలిపాడు.
8 తమను నిర్మూలం చేయమని షూషనులో ప్రకటించిన శాసనం
యొక్క నకలు కూడా అతనికి ఇచ్చి దానిని ఎస్తేరుకు చూపించి
వివరించమని చెప్పాడు; ఆమె రాజు సముఖానికి వెళ్లి తన ప్రజల పట్ల
దయ చూపించేలా రాజును వేడుకోమని చెప్పమని మొర్దెకై అతనితో
చెప్పాడు.

9 హతాకు తిరిగివెళ్లి, మొర్దెకై చెప్పిందంతా ఎస్తేరుకు చెప్పాడు.
10 అప్పుడు ఎస్తేరు మొర్దెకైకి ఇలా చెప్పమని హతాకును పంపించింది:
11 "రాజు పిలువకుండా పురుషుడు గాని స్త్రీ గాని రాజు యొక్క అంతఃపురం లోనికి వెళ్తే, రాజు తన బంగారు దండాన్ని వారివైపు చాపి వారిని బ్రతకనిస్తే తప్ప లేకపోతే వారు చంపబడాలి అనే ఒక చట్టం ఉందని రాజు అధికారులందరికి, రాజ్య సంస్థానాలలో ఉన్న ప్రజలందరికి తెలుసు. అయితే ముప్పై రోజులుగా నేను రాజు దగ్గరకు వెళ్లడానికి నాకు పిలుపు రాలేదు."
12 ఎస్తేరు చెప్పిన మాటలు మొర్దెకైకి తెలియజేయబడినప్పుడు,
13 మొర్దెకై ఎస్తేరుకు మళ్ళీ ఈ జవాబు పంపాడు: "నీవు రాజభవనంలో ఉన్నావు కాబట్టి యూదులందరిలో నీవు మాత్రమే రక్షింపబడతావు అని అనుకోకు.
14 నీవు మౌనంగా ఉంటే, యూదులకు ఉపశమనం, విడుదల వేరే స్థలం నుండి వస్తుంది, అయితే నీవు, నీ తండ్రి కుటుంబం నశిస్తుంది. నీవు ఇలాంటి సమయం కొరకే నీ రాజ్య స్థానంలోనికి వచ్చావేమో ఎవరికి తెలుసు?"
15 అప్పుడు ఎస్తేరు మొర్దెకైకు ఈ జవాబు పంపింది:
16 "వెళ్లండి, షూషనులో ఉన్న యూదులందరిని సమకూర్చి నా కోసం ఉపవాసం ఉండమని చెప్పండి. మూడు రోజులపాటు ఏమీ తినవద్దు త్రాగవద్దు. నేను, నా సేవకులు కూడా మీరు చేసినట్లు ఉపవాసం పాటిస్తాము. ఇలా చేసిన తర్వాత నేను రాజు దగ్గరకు వెళ్తాను అది చట్టానికి విరుద్ధమైనా ఫర్వాలేదు. నేను చస్తే చస్తాను."
17 కాబట్టి మొర్దెకై వెళ్లి ఎస్తేరు తనకు చెప్పినట్లే చేశాడు.

# 5

### రాజు దగ్గర ఎస్తేరు అభ్యర్థన

1 మూడవ రోజు ఎస్తేరు తన రాజవస్త్రాలు ధరించి, రాజభవనం
లోపలి ఆవరణంలో రాజు గది దగ్గర నిలబడింది. ద్వారానికి
ఎదురుగా రాజు తన సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు.
2 ఆవరణంలో ఎస్తేరు రాణి నిలబడి ఉండడం రాజు
చూసినప్పుడు, అతనికి ఆమె పట్ల ఇష్టం కలిగి, తన చేతిలో ఉన్న
బంగారు దండాన్ని ఆమె వైపు చాపాడు. ఎస్తేరు సమీపించి, ఆ దండం
యొక్క అంచును ముట్టుకుంది.
3 అప్పుడు రాజు, "ఎస్తేరు రాణి, ఏంటి విషయం? నీ మనవి
ఏంటి? రాజ్యంలో సగమైనా సరే, నీకు ఇవ్వబడుతుంది" అని
అన్నాడు.
4 ఎస్తేరు జవాబిస్తూ, "రాజుకు ఇష్టమైతే, ఈ రోజు నేను రాజు కోసం
సిద్ధం చేయించిన విందుకు మీరు హామానుతో పాటు రావాలి" అన్నది.
5 రాజు తన సేవకులతో, "ఎస్తేరు అడిగింది జరిగేలా వెంటనే
హామానును తీసుకురండి" అన్నాడు.
కాబట్టి రాజు, హామాను, ఎస్తేరు చేయించిన విందుకు వెళ్లారు.
6 వారు ద్రాక్షరసం త్రాగుతున్నప్పుడు రాజు మరలా ఎస్తేరుతో, "నీ
విన్నపం ఏంటి? అది నీకు ఇస్తాను. నీ మనవి ఏంటి? రాజ్యంలో సగం
అడిగినా సరే నీకు ఇస్తాను" అన్నాడు.
7 ఎస్తేరు జవాబిస్తూ, "నా విన్నపం, నా మనవి ఇది:
8 రాజుకు నాపై దయ కలిగి, నా అభ్యర్థనను మన్నించి నా మనవిని
నెరవేరుస్తానంటే, నేను మీకోసం రేపు ఏర్పాటు చేసే విందుకు రాజైన
మీరు, హామాను రావాలి. అప్పుడు నేను రాజు ప్రశ్నకు జవాబిస్తాను"
అన్నది.

## మొర్దెకై మీద హామాను యొక్క కోపం

9 హామాను ఆ రోజు మహానందంతో బయటకు వెళ్లాడు. కాని,
రాజభవన ద్వారం దగ్గర ఉన్న మొర్దెకై తనను చూసి కూడా లేచి
నిలబడలేదని తన ఎదుట ఎలాంటి భయం చూపించలేదని చూసి
అతనికి మొర్దెకై మీద తీవ్రమైన కోపం వచ్చింది.

10 అయినా హామాను తనను తాను నిగ్రహించుకొని ఇంటికి
వెళ్లాడు.
తన స్నేహితులను, తన భార్యయైన జెరెషును పిలిచి,
11 హామాను గర్వంగా తనకున్న విస్తారమైన ఐశ్వర్యం గురించి,
తనకున్న ఎంతోమంది కుమారుల గురించి, రాజు తనను ఎన్ని
విధాలుగా ఘనపరిచాడో, ఎలా తనను ఇతర సంస్థానాధిపతుల
ఎదుట గౌరవించాడో వారికి గొప్పగా చెప్పుకున్నాడు.
12 హామాను ఇంకా మాట్లాడుతూ, "అంతేకాదు, ఎస్తేరు రాణి,
తాను ఇస్తున్న విందుకు రాజుతో పాటు రమ్మని నన్ను మాత్రమే
పిలిచింది. రేపు విందుకు రాజుతో రమ్మని నన్ను ఆహ్వానించింది.
13 అయితే, రాజ ద్వారం దగ్గర కూర్చున్న యూదుడైన మొర్దెకైను
చూసినంత కాలం ఇదంతా నాకు సంతృప్తినివ్వదు" అని అన్నాడు.
14 అతని భార్య జెరెషు, అతని స్నేహితులందరు, "యాభై
మూరల* ఎత్తుగల ఉరికంబం చేయించు. రేపు ఉదయం మొర్దెకైను
దాని మీద ఉరి తీయమని రాజుకు చెప్పు. తర్వాత రాజుతో పాటు
విందుకు వెళ్లి ఆనందించు" అని అతనికి చెప్పారు. ఈ సలహా
హామానుకు నచ్చింది, కాబట్టి అతడు ఉరికంబం చేయించాడు.

# 6

## మొర్దెకై ఘనపరచబడుట

1 ఆ రాత్రి రాజుకు నిద్రపట్టలేదు; కాబట్టి తన పాలన గురించి ఉన్న
రాజ్య చరిత్ర గ్రంథం తెప్పించి, చదివించుకున్నాడు.
2 అందులో రాజభవన ద్వారపాలకులైన బిగ్తాన్, తెరెషు అనే ఇద్దరు
రాజ్యాధికారులు అహష్వేరోషు రాజును చంపడానికి కుట్రపన్నిన
సంగతిని మొర్దెకై తెలియజేసినట్లు వ్రాయబడి ఉంది.
3 రాజు, "దీని కోసం మొర్దెకై పొందుకున్న ఘనత, గుర్తింపు ఏంటి?"
అని అడిగాడు.

---

* **5:14** అంటే, సుమారు 23 మీటర్లు

అందుకు అతని సేవకులు, “అతని కోసం ఏమి చేయలేదు” అన్నారు.

4 రాజు, “ఆవరణంలో ఉన్నది ఎవరు?” అని అడిగాడు.
అప్పుడే హామాను, తాను సిద్ధపరచిన ఉరికంబం మీద మొర్దెకైను ఉరితీయడం గురించి రాజుతో మాట్లాడడానికి బయట ఆవరణంలోకి ప్రవేశించాడు.

5 రాజు సేవకులు, “హామాను ఆవరణంలో నిలబడ్డాడు” అని చెప్పారు.

వెంటనే, “అతన్ని లోనికి తీసుకురండి” అని రాజు ఆదేశించాడు.

6 హామాను లోపలికి వచ్చినప్పుడు, “రాజు ఒకరిని సన్మానం చేయాలని ఇష్టపడితే ఆ మనిషికి ఏమి చేయాలి?” అని రాజు అతన్ని అడిగాడు.

హామాను, “నన్ను కాకుండా రాజు ఇంకెవరిని సన్మానిస్తాడు?” అని తనలో తాను అనుకున్నాడు.

7 కాబట్టి హామాను రాజుతో, “రాజు సన్మానించాలని అనుకునే వ్యక్తి కోసం,

8 రాజు ధరించుకునే రాజవస్త్రాలను, రాజు స్వారీ చేసే గుర్రాన్ని, రాజు తలమీద పెట్టుకునే రాజకిరీటాన్ని తీసుకురావాలి.

9 తర్వాత ఆ రాజవస్త్రాన్ని ఆ గుర్రాన్ని రాజు యొక్క అత్యంత ఘనులైన ఓ అధిపతికి అప్పగించాలి. రాజు సన్మానించాలని అనుకున్న ఆ వ్యక్తికి ఆ రాజ వస్త్రం వేయించి ఆ గుర్రం మీద నగర వీధుల్లో త్రిప్పుతూ, ‘రాజు ఒక వ్యక్తిని సన్మానించాలని ఇష్టపడితే ఆ వ్యక్తికి ఇలా చేయబడుతుంది!’ అని అంటూ ఆ వ్యక్తి ఎదుట చాటాలి” అని అన్నాడు.

10 అందుకు రాజు, “త్వరగా వెళ్లు, నీవు చెప్పినట్టే రాజ వస్త్రం, గుర్రం తీసుకుని, రాజ ద్వారం దగ్గర కూర్చుని ఉండే యూదుడైన మొర్దెకైకి చేయి. నీవు చెప్పింది ఏదైన మానకు” అని హామానుకు ఆజ్ఞాపించాడు.

11 కాబట్టి హామాను రాజవస్త్రాలు, గుర్రం తీసుకువచ్చి మొర్దెకైకు
ఆ వస్త్రాలు ధరింపజేసి గుర్రం మీద అతన్ని కూర్చోబెట్టి నగర వీధుల్లో
వెళ్తూ, "రాజు ఓ వ్యక్తిని సన్మానించాలని ఇష్టపడితే ఇలా అతనికి
చేయబడుతుంది!" అని అంటూ ఊరేగింపు చేశాడు.
12 తర్వాత మొర్దెకై రాజ ద్వారం దగ్గరకు తిరిగి వచ్చాడు. కాని
హామాను దుఃఖంతో తల కప్పుకుని వేగంగా ఇంటికి వెళ్లి,
13 హామాను తనకు జరిగిందంతా తన భార్య జెరషుకు, తన
స్నేహితులందరికి తెలియజేశాడు.
అతని సలహాదారులు, అతని భార్య జెరెషు అతనితో అన్నారు,
"ఎవరి ఎదుట నీ పతనం ప్రారంభమైందో, ఆ మొర్దెకై యూదుడు
కాబట్టి, అతని ఎదుట నీవు నిలబడలేవు, నీవు ఖచ్చితంగా
పడిపోతావు."
14 వారింకా మాట్లాడుకుంటున్నప్పుడు, రాజు యొక్క నపుంసకులు
వచ్చి, ఎస్తేరు రాణి చేయించిన విందుకు రమ్మని హామానును
తొందరపెట్టారు.

# 7

## హామాను వ్రేలాడదీయబడుట

1 కాబట్టి రాజు హామాను ఇద్దరూ కలిసి, ఎస్తేరు రాణి యొక్క
విందుకు వెళ్లారు.
2 వారు రెండవ రోజు ద్రాక్షరసం త్రాగుతుండగా రాజు మరలా,
"ఎస్తేరు రాణి, నీ విన్నపం ఏంటి? అది నీకు ఇస్తాను. నీ మనవి ఏంటి?
రాజ్యంలో సగమైనా సరే, నీకు ఇవ్వబడుతుంది" అని అన్నాడు.
3 అప్పుడు ఎస్తేరు రాణి, "ఒకవేళ రాజుకు నా మీద దయ కలిగితే
మీకు సరే అనిపిస్తే, నా విన్నపాన్ని బట్టి నా ప్రాణాన్ని, నా మనవిని
బట్టి నా ప్రజలను వదిలేయండి.
4 ఎందుకంటే నేను, నా ప్రజలు నాశనం చేయబడడానికి,
చంపబడడానికి, నిర్మూలించబడడానికి అమ్మబడ్డాము. ఒకవేళ

మేము కేవలం దాసదాసీలుగా అమ్మబడి ఉంటే, నేను మౌనంగా ఉండేదాన్ని, ఎందుకంటే అలాంటి బాధ కోసం రాజును అభ్యంతర పెట్టడం భావ్యం కాదు" అని అన్నది.

5 అందుకు రాజైన అహష్వేరోషు ఎస్తేరు రాణిని, "అలా చేయడానికి
తెగించినవాడు ఎవడు? వాడెక్కడ?" అని అడిగాడు.

6 అందుకు ఎస్తేరు అన్నది, "ఆ విరోధి, శత్రువు, ఈ దుష్టుడైన
హామానే!"

అప్పుడు హామాను, రాజు రాణి ముందు భయంతో వణికిపోయాడు.

7 రాజు ఆవేశంతో లేచి, ద్రాక్షరసం వదిలి రాజభవన తోటలోకి
వెళ్లాడు. అయితే రాజు తనకు హాని చేయాలని నిర్ణయించాడని గ్రహించిన హామాను తన ప్రాణాల కోసం ఎస్తేరు రాణిని బ్రతిమాలడానికి అక్కడే ఉండిపోయాడు.

8 తోటలో నుండి రాజు విందుశాలకు వచ్చాడు, ఆ సమయంలో
హామాను ఎస్తేరు రాణి కూర్చున్న మంచం పైన పడి ఉండడం చూశాడు.

రాజు ఆవేశంతో, "ఇంట్లో రాణి నాతో ఉండగానే వీడు రాణి మీద అత్యాచారం చేస్తాడా?" అని అన్నాడు.

రాజు నోటి నుండి ఆ మాట రావడంతోనే సైనికులు హామాను ముఖానికి ముసుగు వేశారు.

9 రాజు సేవచేసే నపుంసకులలో హర్బోనా అనే ఒకడు, "నిజానికి,
రాజు తరపున మాట్లాడిన మొర్దెకైని చంపించడానికి హామాను తన ఇంటి వద్ద యాభై మూరల* ఒక ఉరికంబాన్ని చేయించాడు" అని చెప్పాడు.

వెంటనే రాజు, "దానిమీదే అతన్ని ఉరితీయండి" అని అన్నాడు.

10 మొర్దెకై కోసం హామాను చేయించిన ఉరికంబం మీద
హామానును ఉరితీశారు. అప్పుడు రాజు కోపం చల్లారింది.

* **7:9** అంటే, సుమారు 23 మీటర్లు

# 8

## యూదుల పక్షాన రాజు శాసనం

1 అదే రోజు రాజైన అహష్వేరోషు యూదుల శత్రువైన హామాను
ఇంటిని ఎస్తేరు రాణికి ఇచ్చాడు. మొర్దెకైతో తనకున్న బంధుత్వం
గురించి ఎస్తేరు రాజుకు చెప్పింది. మొర్దెకై రాజు సముఖంలోకి
వచ్చాడు.
2 రాజు హామాను నుండి తిరిగి తీసుకున్న తన ముద్ర ఉంగరం తీసి
మొర్దెకైకి ఇచ్చాడు. ఎస్తేరు అతన్ని హామాను ఆస్తుల మీద అధికారిగా
నియమించింది.
3 ఎస్తేరు రాజు పాదాల మీద పడి ఏడుస్తూ, తిరిగి మనవి
చేసింది. అగగీయుడైన హామాను యూదులకు విరుద్ధంగా చేసిన కీడు
ప్రణాళికను భంగం చేయాలని వేడుకొంది.
4 అప్పుడు రాజు తన బంగారు రాజదండం ఎస్తేరు వైపు చూపాడు,
ఆమె లేచి అతని ఎదుట నిలబడింది.
5 ఆమె, "ఒకవేళ రాజుకు ఇష్టమైతే, నాపై దయ కలిగితే,
అలా చేయడం సరియైనదని రాజు అనుకుంటే, అగగీయుడు,
హమ్మెదాతా కుమారుడైన హామాను కుట్రపన్ని, రాజు సంస్థానాలలో
ఉన్న యూదులను నిర్మూలం చేయాలని వ్రాయించిన తాకీదులను
రద్దు చేయడానికి ఆజ్ఞ ఇవ్వండి.
6 ఎందుకంటే, నా ప్రజలమీదికి రాబోతున్న కీడును, నా వంశం
మీదికి వచ్చే నాశనాన్ని నేనెలా ఎలా భరించగలను?" అన్నది.
7 రాజైన అహష్వేరోషు ఎస్తేరు రాణికి, యూదుడైన మొర్దెకైకి
జవాబిస్తూ అన్నాడు, "హామాను యూదులపై దాడి చేసినందుకు నేను
అతని ఆస్తిని ఎస్తేరుకు ఇచ్చాను. అతడు సిద్ధం చేసిన స్తంభానికి
అతన్ని వ్రేలాడదీశారు.
8 రాజు పేరిట వ్రాయబడి అతని ఉంగరంతో ముద్ర వేసిన ఏ తాకీదు
రద్దు చేయబడదు. కాబట్టి మీకు నచ్చినట్లు యూదుల పక్షాన రాజు
పేరిట మరొక శాసనాన్ని వ్రాసి రాజముద్ర వేయండి."

9 సీవాను అనే మూడవ నెల ఇరవై మూడవ రోజున రాజ్య లేఖికులు
రు. వారు మొర్దెకై ఆదేశాల ప్రకారం, ఇండియా నుండి కూషు* వరకు
ఉన్న మొత్తం నూట ఇరవై ఏడు సంస్థానాలలో ఉన్న యూదులకు,
సంస్థానాధిపతులకు, ప్రభుత్వ అధికారులకు, ప్రముఖులకు వారి వారి
భాషలో లిపిలో, యూదులకు కూడా వారి సొంత లిపిలో భాషలో
తాకీదులు వ్రాశారు.

10 మొర్దెకై రాజైన అహష్వేరోషు పేరిట తాకీదులను వ్రాయించి
రాజు ఉంగరంతో ముద్రించి, రాజు సేవకు ప్రత్యేకంగా ఉపయోగించే
గుర్రాలపై వేగంగా స్వారీ చేసే వార్తాహరులతో వాటిని పంపాడు.

11 రాజు ఆదేశం, యూదులు ప్రతి పట్టణంలో తమను తాము
కాపాడుకునే హక్కు కలిగించింది; వారి మీద, వారి స్త్రీల మీద, పిల్లల
మీద దాడి చేసే ఏ జాతి వారినైనా, ఏ సంస్థానం వారినైనా, వారు
నాశనం చేయవచ్చు, చంపవచ్చు, నిర్మూలించవచ్చు, వారి శత్రువుల
ఆస్తిని కొల్లగొట్టవచ్చు.

12 రాజైన అహష్వేరోషు సంస్థానాలన్నిటిలో యూదులు ఇలా
చేయడానికి నియమించబడిన రోజు అదారు నెల అనే పన్నెండవ నెల,
పదమూడవ రోజు.

13 ఆ రోజున యూదులు తమ శత్రువుల మీద ప్రతీకారం
తీర్చుకునేందుకు సిద్ధపడేలా ఈ తాకీదుకు ప్రతులు వ్రాయించి అన్ని
సంస్థానాలలో ఉన్న ప్రజలందరికి పంపాలని ఆజ్ఞ ఇవ్వబడింది.

14 రాజాజ్ఞ ప్రకారం వార్తాహరులు, రాజ్య గుర్రాల మీద వేగంగా
స్వారీ చేస్తూ వెళ్లి, ఆ శాసనాలను షూషను కోటలో అందజేశారు.

## యూదుల విజయం

15 మొర్దెకై రాజు దగ్గర నుండి బయలుదేరినప్పుడు, అతడు నీలి
తెలుపు రంగుల రాజ వస్త్రం పెద్ద బంగారు కిరీటం శ్రేష్ఠమైన ఊదా

---

* **8:9** అంటే, నైలు ఉపరితల ప్రాంతం

రంగు సన్నని నారతో చేయబడిన వస్త్రం ధరించాడు. షూషను పట్టణం
ఎంతో ఆనందంతో సంబరపడింది.
16 యూదులకు అది సంతోషం, ఆనందం, ఉత్సాహం ఘనతగల
సమయం.
17 రాజు తాకీదులు అందిన ప్రతి సంస్థానంలో, ప్రతి పట్టణంలో
యూదులలో ఆనందం, ఉత్సాహం ఉంది, వారు విందు చేసుకుని
సంబరపడ్డారు. ఇతర దేశాల ప్రజలు ఎంతోమంది యూదుల భయం
పట్టుకుని యూదులుగా మారారు.

# 9

1 అదారు అనే పన్నెండవ నెల, పదమూడవ రోజున, రాజు
శాసనం అమల్లోకి వచ్చింది. ఈ రోజున యూదుల శత్రువులు
వారిని జయించగలమని నిరీక్షించారు కాని దానికి భిన్నంగా జరిగింది,
యూదులు తమను ద్వేషించేవారి మీద పైచేయి కలిగి ఉన్నారు.
2 యూదులు రాజైన అహష్వేరోషు సంస్థానాలన్నిటిలో తమ
పట్టణాల్లో సమావేశమై, వారిని నాశనం చేయాలని నిర్ణయించుకున్న
వారిపై దాడి చేశారు. వారి ఎదుట ఎవరూ నిలువలేకపోయారు,
ఎందుకంటే ఇతర దేశాల ప్రజలందరు వారికి భయపడ్డారు.
3 సంస్థానాధిపతులు, సామంత రాజులు, ప్రభుత్వ అధికారులు,
రాజ్య అధికారులు, అందరు మొర్దెకై అంటే భయంతో యూదులకు
సహాయపడ్డారు.
4 మొర్దెకై రాజభవనంలో ప్రముఖుడయ్యాడు; అతని
కీర్తి సంస్థానాలన్నిటిలో వ్యాపించింది, అతడు అంతకంతకు
శక్తిగలవాడయ్యాడు.
5 యూదులు తమ శత్రువులందరి మీద ఖడ్గంతో దాడి చేసి చంపి
నాశనం చేసి, తమను ద్వేషించిన వారికి తమకు ఇష్టమైనట్టుగా
చేశారు.
6 షూషను కోటలో యూదులు అయిదువందల మంది
మనుష్యులను చంపి నాశనం చేశారు.

7-9 వారు పర్షందాతా దల్ఫోను అస్పాతా పోరాతా అదల్యా
అదీదాతా పర్మష్తా అరీసై అరీదై వైజాతాలను కూడా చంపారు.
10 ఈ పదిమంది యూదుల శత్రువైన హమ్మెదాతా కుమారుడైన
హామాను కుమారులు. అయితే వారు వారి దోపుడుసొమ్మును
ముట్టలేదు.

11 షూషను కోటలో చంపబడినవారి సంఖ్య ఆ రోజే రాజుకు
చెప్పారు.
12 రాజు ఎస్తేరు రాణితో, "యూదులు షూషను కోటలో
అయిదువందల మందిని హామాను పదిమంది కుమారులను
చంపారు. రాజు యొక్క ఇతర సంస్థానాలలో ఏమి జరిగింది?
ఇప్పుడు నీ మనవి ఏంటి? అది నీకు ఇస్తాను. నీ కోరిక ఏంటి? అది
కూడా చేస్తాను" అన్నాడు.

13 ఎస్తేరు జవాబిస్తూ, "ఒకవేళ రాజుకు ఇష్టమైతే, ఈ శాసనం
రేపు కూడా షూషనులో ఉన్న యూదులు చేసేలా అనుమతి ఇచ్చి
హామాను పదిమంది కుమారులు ఉరికంబం మీద వ్రేలాడదీయబడేలా
చేయండి" అని చెప్పింది.

14 కాబట్టి అలా చేయమని రాజు ఆజ్ఞాపించాడు. షూషనులో ఆజ్ఞ
జారీ చేయబడింది, వారు హామాను యొక్క పదిమంది కుమారులను
ఉరితీశారు.
15 అదారు నెల పద్నాలుగవ రోజున యూదులు షూషనులో
సమకూడి, షూషనులో మూడువందలమంది మనుష్యులను
చంపారు. కాని వారి దోపుడుసొమ్మును ముట్టలేదు.

16 అంతలో, రాజు సంస్థానాలలో ఉన్న మిగితా యూదులు
కూడా తమను తాము కాపాడుకోడానికి సమకూడి శత్రువుల నుండి
ఉపశమనం పొందుకున్నారు.వారు డెబ్బై అయిదువేల మందిని
చంపారు కాని వారి దోపుడుసొమ్మును ముట్టలేదు.

17 ఇది అదారు నెల పదమూడవ రోజున జరిగింది. పద్నాలుగవ
రోజు వారు విశ్రమించి ఆ రోజున విందు చేసుకుని ఆనందించారు.

18 అయితే షూషనులో ఉన్న యూదులు పదమూడు, పద్నాలుగవ
రోజులు కూడుకుని, పదిహేనవ రోజున విశ్రమించి, ఆ రోజున విందు
చేసుకుని ఆనందించారు.
19 గ్రామాల్లో నివసించే పల్లెవాసులైన యూదులు అదారు
నెల పద్నాలుగవ రోజున విందు చేసుకుని ఆనందించే రోజుగా
జరుపుకుంటారు, ఆ రోజు ఒకరికి ఒకరు బహుమానాలు
ఇచ్చుకుంటారు.

## పూరీము స్థాపించబడుట

20 మొర్దెకై ఈ సంగతులన్నీ నమోదు చేసి, రాజైన అహష్వేరోషు
సంస్థానాలన్నిటికి దగ్గరలో దూరంలో నివసిస్తున్న యూదులందరికి
ఉత్తరాలు పంపాడు.
21-22 యూదులు తమ శత్రువుల నుండి ఉపశమనం
పొందుకున్నారు, తమ బాధ సంతోషంగా మారింది, తమ దుఃఖం
ఆనందించే రోజుగా మారింది కాబట్టి ప్రతి ఏట అదారు నెల
పద్నాలుగు, పదిహేను రోజుల్లో వార్షిక పండగ జరుపుకోవాలని
అతడు వ్రాశాడు. ఆ రోజులు విందు చేసుకుని ఆనందించే రోజులుగా,
ఒకరికి ఒకరు ఆహార బహుమానాలు ఇచ్చుకునే రోజులుగా, పేదలకు
బహుమానాలు ఇచ్చే రోజులుగా జరుపుకోవాలని అతడు వారికి
వ్రాశాడు.
23 కాబట్టి యూదులు మొర్దెకై తమకు వ్రాసిన ప్రకారం తాము
ప్రారంభించిన ఉత్సవం కొనసాగిస్తామని ఒప్పుకున్నారు.
24 యూదులందరికి శత్రువైన అగగీయుడు హమ్మెదాతా
కుమారుడైన హామాను యూదులను నాశనం చేయడానికి కుట్రపన్ని,
వారిని నాశనం చేసి, నిర్మూలించడానికి పూరు (అనగా, చీట్లు)
వేశాడు.
25 అయితే ఈ కుట్ర గురించి రాజుకు తెలిసినప్పుడు,* అతడు
హామాను యూదులకు వ్యతిరేకంగా తలపెట్టిన కీడు అతని

* **9:25** లేదా ఎస్తేరు రాజు ఎదుటకు వచ్చినప్పుడు

మీదికే వచ్చేలా చేసి, అతన్ని అతని కుమారులను ఉరికంబాలకు వ్రేలాడదీయాలని రాజు వ్రాతపూర్వక ఆదేశాలు జారీ చేశాడు.

26 (అందువల్ల ఈ రోజులకు పూరు అనే పదం నుండి వచ్చిన
పూరీము అని పేరు వచ్చింది.) ఈ ఉత్తరంలో వ్రాయబడిన ప్రతి విషయం బట్టి, వారు చూసిన, తమకు జరిగిన వాటిని బట్టి, వారు ఏమి చూశారో, వారికి ఏమి జరిగిందో దానిని బట్టి,

27 యూదులు ప్రతి సంవత్సరం ఈ రెండు రోజులను ఒక ఆచారంగా
నిర్ణయించిన విధానంలో నియమించిన సమయంలో తాము తమ వారసులు, తమతో కలిసే వారందరితో ఖచ్చితంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

28 తరతరాల వరకు ప్రతి సంస్థానంలో, ప్రతి పట్టణంలో, ప్రతి
కుటుంబం ద్వారా వచ్చే ప్రతి తరం వారు ఈ రోజులను జ్ఞాపకం చేసుకుని ఉత్సవంగా జరుపుకోవాలి. యూదులు ఈ పూరీము రోజులు పాటించకుండా ఉండకూడదు. ఈ రోజుల జ్ఞాపకం వారి వారసులు ఎన్నడూ మరచిపోకూడదు.

29 కాబట్టి అబీహాయిలు కుమార్తెయైన ఎస్తేరు రాణి,
యూదుడైన మొర్దెకైతో కలిసి పూరీము గురించి ఈ రెండవ లేఖను ధృవీకరించడానికి పూర్తి అధికారంతో వ్రాశారు.

30 అహష్వేరోషు సామ్రాజ్యంలో 127 సంస్థానాలలో ఉన్న
యూదులందరికి క్షేమం, నమ్మకం కలిగించే మాటలతో కూడిన ఉత్తరాన్ని మొర్దెకై పంపాడు.

31 యూదుడైన మొర్దెకై ఎస్తేరు రాణి శాసించిన విధంగా పూరీము
దినాలను వాటి సమయాల్లో జరిగేలా నిర్ధారించినట్టే వారు తమ కోసం తమ వారసుల కోసం ఉపవాస విలాప దినాలను పాటించే బాధ్యత తీసుకున్నారు.

32 ఎస్తేరు శాసనం వలన పూరీము గురించిన ఈ నిబంధనలు
నిర్ధారించబడి చరిత్ర గ్రంథాల్లో వ్రాయబడ్డాయి.

# 10

## మొర్దెకై గొప్పతనం

1 అహష్వేరోషు రాజు తన సామ్రాజ్యమంతటా, సముద్ర తీరాల
వరకు కప్పం విధించాడు.
2 అతని బలప్రభావాలుగల చర్యలు, రాజు హెచ్చించిన మొర్దెకై
యొక్క గొప్పతనం యొక్క పూర్తి వివరాలు, మాదీయులు, పర్షియా
రాజుల చరిత్ర గ్రంథాల్లో వ్రాయబడలేదా?
3 రాజైన అహష్వేరోషుకు రెండవ స్థానంలో యూదుడైన మొర్దెకై
ఉన్నాడు, అతడు యూదులలో ప్రముఖునిగా, తన తోటి యూదులైన
ఎంతోమంది ద్వారా గౌరవం పొందుకున్నాడు, ఎందుకంటే తన
ప్రజల క్షేమాన్ని విచారిస్తూ, యూదులందరి యొక్క శ్రేయస్సు కోసం
మాట్లాడేవాడు.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6